మహిళలకు రూ.2,500, బంగారం ఆ ప్రచారంలో నిజం లేదన్న తెలంగాణ ప్రభుత్వం

- వార్త 2 లో..

PRGI: TGTEL/26/A6429

# యువ వెలుగు

E- Paper, www.yuvavelugu.com
తెలుగు దిన పత్రిక

యువ వెలుగు తెలుగు దిన పత్రికలో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను
మండలం । నియోజకవర్గం । జిల్లా వారీగా రిపోర్టర్లు కావలెను
9908 502 602

సంపుటి : 01 సంచిక : 36 | ప్రచురణ : రంగారెడ్డి | ఎడిటర్ : పి. మహేష్ గౌడ్ | శుక్రవారం 09-10-2026 | పేజీలు : 4 ధర :- 02/-

# ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు
# బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్

**ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్**
**ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు**
**సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్**
**ఓట్లు తీసేస్తే రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారని హెచ్చరిక**



**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 08 :** ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. పధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ తరువాయి 2లో..

# భూ వివాదంలో కొత్త ట్విస్ట్

- భూమి లేకున్నా రైతు బంధు తీసుకుంటున్న బొజ్జ రాజిరెడ్డి..
- రికార్డుల్లో ఉన్న భూమిని అక్రమంగా విక్రయించారంటూ రైతు ఆరోపణలు



రైతు పాలకూర్ల వెంకటయ్య

**రంగారెడ్డి, యువ వెలుగు, అక్టోబర్ 08 :** మాడ్గుల మండలం నాగిళ్ళ గ్రామం, కడ్తాల్ మండలం లోని సరికొండ శివారులోని సర్వే నెంబర్ 31 లో మొత్తం విస్తీర్ణం 15 ఎకరాల 20గుంటలు భూమి విస్తీర్ణం కలదు.. అందులో 5 ఎకరాల 35 గుంటల భూమి ని కొంత మంది రైతులకు బొజ్జ జంగా రెడ్డి S/o.బొజ్జ రాజి రెడ్డి కొంత మంది రైతులకు 1978 -1983 మధ్య కాలంలో అమ్మడం జరిగింది. ఈ భూమికి 5ఎకరాల భూమి అమ్మగా మిగతా 9ఎకరాలు పైచిలుకు భూమి రికార్డు లో ఉంది కానీ అక్కడ ఇప్పటికి అధికారికంగా 3 సార్లు సర్వే చేసిన కూడా భూమి విస్తీర్ణం శూన్యం.. 2022 లో బొజ్జ జంగారెడ్డి S/o. రాజిరెడ్డి, జంగారెడ్డి కుమారుడు రాజిరెడ్డి దొంగతనంగా అధికారులకు భయపెట్టి, 2022 లో పాస్ బుక్ తహసీల్దార్ నుండి తీసుకొవడం..2022 ముందు అతనికి పాసుబుక్ లేదు..2022 నుండి ప్రభుత్వం నుండి అక్రమంగా రైతు బంధు కూడా పొందుతున్నాడు..ఎలాంటి భూమి లేకుండా ఉన్నప్పటికీ రైతు బంధు పొందుతున్నాడు .. భూములకు రేట్లు పెరగడం వలన - తరువాయి 2లో

# స్టాక్ మార్కెట్లో అమ్మకాల సునామీ

**1,045 పాయింట్లు కుప్పకూలిన సెన్సెక్స్**



**న్యూఢిల్లీ :** భారత ఈక్విటీ మార్కెట్లు గురువారం భారీ అమ్మకాల ఒత్తిడితో కుప్పకూలాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భగ్గుమనడం, వడ్డీ రేట్లు దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలోనే కొనసాగుతాయనే ఆందోళనలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల తరలింపు వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ఫలితంగా సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్‌ఈ సెన్సెక్స్ 1045.46 పాయింట్లు (1.44%) పతనమై 71,593.24 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా 371.25 పాయింట్లు (1.64%) నష్టపోయి 22,231.80 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ ధర ఏకంగా 4% పెరిగి బ్యారెల్‌కు 104 డాలర్ల మార్కును దాటడం మార్కెట్లలో భయాందోళనలకు ప్రధాన కారణమైంది. ఇది ద్రవ్యోల్బణ తరువాయి 2లో..

# ‘బిల్డ్ ఏపీ’ నినాదంతో ముందుకు వెళుతున్నాం

**సీఎం చంద్రబాబు**

- ఢిల్లీలో సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న సీఎం, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఒప్పందాలను వాస్తవ పెట్టుబడులుగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి
- ఏపీ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చిన పీయూష్ గోయల్
- గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి భారీ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని వెల్లడి



**అమరావతి, యువ వెలుగు అక్టోబర్ 08 :** ‘బిల్డ్ ఏపీ’ నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో దేశంలోనే అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు.

గత 28 నెలల్లో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చంద్రబాబు తెలిపారు. కేవలం అవగాహన ఒప్పందాల (ఎంవోయూ)కే పరిమితం కాకుండా, వాటిని వాస్తవ పెట్టుబడులుగా మార్చేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వస్తున్నాయని వెల్లడించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఎస్క్రో ఖాతాను నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. పెట్టుబడులకు అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలకు అన్ని అనుమతులు వేగంగా అందిస్తున్నామని తరువాయి 2లో..

# బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు: మహేశ్ గౌడ్




**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 08 :** తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై ఏకంగా 92 లక్షల ఓట్లను తొలగించాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉండటానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ప్రజలు ఇప్పటికైనా మేల్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. లోక్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు తరువాయి 2లో..

# రైతులకు బేడీలా : కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం



- జూరాల నీటి కోసం ఆందోళన చేసిన రైతులపై కేసులు నమోదు
- ప్రభుత్వ చర్యపై తీవ్రంగా మండిపడ్డ మాజీ మంత్రి హరీశ్ రావు
- ఇది ప్రజా పాలన కాదు, ప్రజా పీడన అంటూ విమర్శలు
- రైతులపై కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

**హైదరాబాద్, యువ వెలుగు అక్టోబర్ 08 :** పంటలు కాపాడుకునేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయాలని ఆందోళన చేసిన రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఇది ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. ఈ మేరకు ఆయన ‘ఎక్స్’ ఖాతా వేదికగా స్పందించారు. “కళ్ల ముందే ఎండుతున్న పంటలకు నీరివ్వమని అడిగిన రైతులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. రేవంత్ రెడ్డి పాలనలో రైతుల తరువాయి 2లో..

# రాహుల్ ప్రియాంకపై దాడికి నిరసనగా కోమటిరెడ్డి నిరాహారదీక్ష

- ఓటు హక్కును హరిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటం ఆగదు
- రాజ్యాంగ పరిరక్షణ కోసమే మా నాయకుల పోరాటం
- అవసరమైతే ఆమరణ నిరాహారదీక్ష చేపడుతాం
- జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్, యువ వెలుగు, అక్టోబర్ 08 :** మోదీ కనుసన్నల్లో జరుగుతున్న ఈసీ అక్రమాలకు నిరసనగా శాంతియుతంగా ధర్నా చేసిన రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ లపై పోలీసులచే దాడి చేయించిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తరువాయి 2లో..

# ప్రపంచానికి ‘సూపర్ డూపర్ ఎల్ నినో’ ముప్పు



**ఎర్రగా మారిన భూగోళం!**

- ప్రపంచవ్యాప్తంగా “సూపర్ డూపర్ ఎల్ నినో” హెచ్చరికలు
- భూగోళం దాదాపు పూర్తిగా ఎరుపు రంగులోకి మారిందన్న నిపుణులు
- పసిఫిక్ సముద్రంలో రికార్డు స్థాయిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో ప్రభావం కొనసాగే అవకాశం

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ నిపుణులు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ‘ఎల్ నినో’ అసాధారణ రీతిలో బలపడి, ‘సూపర్ డూపర్ ఎల్ నినో’గా మారుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది 1950 తర్వాత సంభవించిన అత్యంత శక్తిమంతమైన ఎల్ నినోలలో ఒకటిగా నిలిచిపోవచ్చని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (WMO) అంచనా వేసింది. మానవ ప్రేరిత వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇది మరింత తీవ్రతరం చేస్తుందని వెల్లడించింది. పసిఫిక్ మహా సముద్రం భారీ ఎత్తున ఉష్ణాన్ని విడుదల చేస్తుండటంతో భూగోళం లోని మెజారిటీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగనున్నాయి. వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మాయే విడుదల చేసిన గ్లోబల్ క్లైమేట్ మ్యాప్‌లో, అమెరికా మినహా భూమి దాదాపు పూర్తిగా ఎరుపు రంగులో కనిపిస్తోంది. ఎల్ నినో ప్రస్తుతం గరిష్ఠ తరువాయి 2లో..

# రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే

## కొత్తగూడెం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నేతల సమావేశం




**కొత్తగూడెం టౌన్, యువ వెలుగు అక్టోబర్ 08 :** కొత్తగూడెం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు, పట్టభద్రుల ఓటరు నమోదు తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా కేసీఆర్ పేరు వినిపిస్తోందని, రాబోయేది మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. "రాసి పెట్టుకోండి.. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే" అని అన్నారు.
బీఆర్ఎస్ నేత తక్కెళ్లపల్లి రవీందర్ మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి సంబంధించిన లెక్కలను తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ వరకు పట్టభద్రులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులు ఈసారి మోసపోవద్దని, ఉద్యోగాలు, ఉపాధి విషయంలో ప్రభుత్వం ఇచ్చే హామీలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రివర్యులు వనమా వెంకటేశ్వరరావు మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు బానోత్ హరిప్రియ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు రూ.2,500, బంగారం ఆ ప్రచారంలో నిజం లేదన్న తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, యువ వెలుగు అక్టోబర్ 08 :**తెలంగాణలో మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఆర్థిక సాయంతో పాటు, కళ్యాణలక్ష్మి పథకం కింద రెండు తులాల బంగారం ఇస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్న వార్తలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇదంతా పూర్తిగా అసత్య ప్రచారమని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని బుధవారం స్పష్టం చేసింది. బతుకమ్మ పండుగ నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే, ఇది ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టూల్స్ ఉపయోగించి సృష్టించిన నకిలీ వీడియో అని ప్రభుత్వ ఫ్యాక్ట్-చెక్ విభాగం వెల్లడించింది. సీఎం రేవంత్ రెడ్డి చిత్రానికి డీప్‌ఫేక్ ఆడియోను జోడించి ఈ వీడియోను రూపొందించారని, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది.

ఈ నేపథ్యంలో, ప్రజలు ఇలాంటి నిరాధారమైన, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. కేవలం ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, సోషల్ మీడియాలో ధ్రువీకరణ లేకుండా వచ్చే వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

రాష్ట్రంలో మహిళల కోసం కళ్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయి. అయితే, వైరల్ వీడియోలో పేర్కొన్నట్లుగా ప్రతినెలా రూ. 2,500 సాయం, రెండు తులాల బంగారం వంటి హామీలపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని స్పష్టమవుతోంది. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ కొందరు సృష్టిస్తున్న ఇలాంటి నకిలీ వార్తల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వర్గాలు పునరుద్ఘాటించాయి.

# స్టాక్ మార్కెట్లో అమ్మకాల సునామీ

(మొదటి పేజీ తరువాయి)

ఒత్తిళ్లను మరింత పెంచుతుందనే ఆందోళనలు రేకెత్తించింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 22,179.90 వరకు పడిపోయి, 2026 సంవత్సరంలోనే అత్యంత కనిష్ట స్థాయిని నమోదు చేసింది. టెక్నికల్‌గా చూస్తే, నిఫ్టీ కీలకమైన మద్దతు స్థాయిలను కోల్పోయిందని, ఇప్పుడు 22,000 పాయింట్ల మానసిక మద్దతు స్థాయిపై దృష్టి కేంద్రీకృతమైందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ సూచీ కోలుకోవడానికి ప్రయత్నిస్తే 22,400, ఆ తర్వాత 22,600 వద్ద ప్రతిఘటన ఎదుర్కోవచ్చని అంచనా వేస్తున్నారు.

ఈ అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ కనిపించింది. మెటల్ రంగ షేర్లు అత్యధికంగా నష్టపోగా, ఐటీ రంగం మాత్రం కొంతమేర తట్టుకుని నిలబడింది. సెన్సెక్స్-30 షేర్లలో టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్ మాత్రమే లాభపడగా.. ఐటీసీ, ఇండిగో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, మారుతీ సుజుకీ వంటి దిగ్గజాలు కూడా నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.53%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.34% చొప్పున పడిపోయాయి. రానున్న రోజుల్లో మార్కెట్ దృష్టి క్యూ2 (రెండో త్రైమాసికం) ఫలితాలపైకి మళ్లనుంది. డిమాండ్ స్థిరత్వం, ముడిసరుకుల వ్యయాల నిర్వహణపై కంపెనీల యాజమాన్యాలు చేసే వ్యాఖ్యలు సమీప భవిష్యత్తులో మార్కెట్ గమనాన్ని నిర్దేశించనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 'బిల్డ్ ఏపీ' నినాదంతో ముందుకు వెళుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు.

**వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు**

నదుల అనుసంధానం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నీటి కొరత తీర్చవచ్చని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా, రాష్ట్రాన్ని సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా మార్చడమే ధ్యేయమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో భాగంగా ఇప్పటికే 110 గిగావాట్లకు ఒప్పందాలు కుదిరాయని, ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దుగరాజపట్నం, మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కేంద్రాలు, తిరుపతి, కొప్పర్తిలలో ఎలక్ట్రానిక్స్, డ్రోన్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాలనలో ఏఐ సాంకేతికతను వినియోగిస్తున్నామని, అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సహకారం అభినందనీయమని, పోలవరం, అమరావతి నిర్మాణానికి అండగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**భారత ప్రగతిలో ఏపీది కీలక పాత్ర: పీయూష్ గోయల్**

ఈ కార్యక్రమంలో మాట్లాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, భారత అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్‌ది చారిత్రక పాత్ర అని కొనియాడారు. శాతవాహనుల కాలం నుంచే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యానికి ప్రసిద్ధి అని గుర్తుచేశారు. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "టీమ్ ఇండియా"గా కలిసి పనిచేస్తున్నాయని, కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. 'ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష' అనే విధానాలతో దేశం ముందుకు సాగుతోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ ప్రియాంకపై దాడికి నిరసనగా కోమటిరెడ్డి నిరాహారదీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ముకరంపుర లోని తన కార్యాలయం వద్ద నాయకులు కార్యకర్తలతో కలిసి ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ లోక్ సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీ మోదీ కనుసన్నల్లో చీఫ్ ఎలక్షన్ కమీషనర్ జ్ఞానేశ్ కుమార్ చేసిన తప్పిదాలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలీసులచే దాడి చేపించి అరెస్టులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని అటువంటి ఓటు హక్కును కేంద్రం ప్రభుత్వం సీఈసీని అడ్డుపెట్టుకుని అన్యాయం చేస్తోందని నరేందర్ రెడ్డి అన్నారు.రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి దేశ ప్రజల పూర్తి మద్దతుందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఫాం 6 లో 2002 లో ఓటు హక్కు పొందిన వారి వివరాలు నమోదు చేయాలని ఉందని అప్పుడు ఓటు వేయని వారి కుటుంబాల పరిస్థితేంటని,బోగస్ ఫాం 7 ద్వారా బోగస్ సంతకాలు పెట్టి బీజేపీ నాయకులు ఓట్లు కొల్లగొడుతున్నారని నరేందర్ రెడ్డి ఆరోపించారు.
అన్ని అక్రమాలకు జ్ఞానేశ్ కుమార్ మద్దతు ఉందని అందుకే జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వ వైఖరి ఇదే విధంగా కొనసాగుతే అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు మేం సిద్ధమని నరేందర్ రెడ్డి హెచ్చరించారు.

ఈ నిరాహార దీక్ష లో ఎండి తాజ్,కార్పోరేటర్లు వరాల నర్సింగం,పర్వతం మల్లేశం,కాంతాల జగన్ రెడ్డి,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,నిహాల్ అహ్మద్, ఎండి చాంద్,ముక్క భాస్కర్, లాయక్, షబానా మహమ్మద్,కుర్ర పోచయ్య, ముల్కల కవిత, అస్థాపురం తిరుమల ,జ్యోతి రెడ్డి, మహాలక్ష్మి, మిరాజ్,జీడి రమేష్, అస్థాపురం రమేష్, గోనె స్వప్న, జిలకర రమేష్, సాయిరాం, భారీ, బషీర్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచానికి 'సూపర్ డూపర్ ఎల్ నినో' ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

శక్తితో కొనసాగుతోందని, దీని ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. నినో 3.4 ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4ీజ ఎక్కువగా నమోదయ్యాయని, ఇది గత రికార్డులన్నింటినీ అధిగమించిందని మరో వాతావరణ శాస్త్రవేత్త జీక్ హాస్‌ఫాదర్ తెలిపారు.

2026 చివరి నాటికి మధ్య, తూర్పు పసిఫిక్ ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రికార్డు స్థాయిలో 3.7ీజ మేర పెరిగే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ అంచనా వేసింది. ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రపంచవ్యాప్తంగా 2027 ఫిబ్రవరి నాటికి దాదాపు 4,51,000 అదనపు మరణాలు సంభవించే ప్రమాదముందని చికాగో యూనివర్సిటీ పరిశోధకులు హెచ్చరించారు. సాధారణంగా ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఎల్ నినో, ప్రపంచ ఉష్ణోగ్రతలను పెంచడంతో పాటు వర్షపాత గమనంలోనూ భారీ మార్పులకు కారణమవుతుంది.

# రైతులకు బేడీలా : కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

చేతులకు బేడీలు వేయడం, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం పరిపాటిగా మారింది" అని హరీశ్ రావు విమర్శించారు. వారి చేతగానితనం వల్ల పంటలకు నీరందకపోతే, కడుపు మండి నిలదీసిన రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా? అని ప్రశ్నించారు. కృష్ణాలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించి, ఇప్పుడు రైతులను శిక్షిస్తున్నారని ఆరోపించారు.

"ఇది ప్రజా పాలన కాదు. ప్రజా పీడన. తప్పు ప్రభుత్వం చేస్తే శిక్ష రైతులు అనుభవించాలా?" అని హరీశ్ రావు నిలదీశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# బెంగాల్, బీహార్ తర్వాత తెలంగాణను టార్గెట్ చేస్తున్నారు: మహేశ్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. దేశవ్యాప్తంగా యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "బీహార్, పశ్చిమ బెంగాల్ తర్వాత ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం తెలంగాణను టార్గెట్ చేసింది. మోదీ, అమిత్ షా పాలనలో గత 12 ఏళ్లలో ప్రజలకు ఏమైనా మేలు జరిగిందా అని ఆలోచించుకోవాలి" అని ఆయన అన్నారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగానే నిరసన తెలుపుతున్నామని స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన్ను పదవి నుంచి తొలగించే వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చి చెప్పారు.

# ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు.

ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

## బిల్లా యాదవ రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**హైదరాబాద్, యువ వెలుగు అక్టోబర్ 08 :** దేవరుప్పుల మండలం,కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బిల్లా యాదవ రెడ్డికి ప్రయివేటు ఆస్పత్రిలో ఇటీవల గుండెకు స్టెంట్ వేయగా మేడిపల్లిలోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని మనో ధైర్యం చెప్పిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. వారి వెంట జిల్లా నాయకులు పల్లా సుందర్ రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్,బిల్లా వెంకటేశ్వర్ రెడ్డి,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి,కామారెడ్డి గూడెం సర్పంచ్ చింత రవి,యువజన నాయకులు ఇప్ప పృథ్వీ రెడ్డి,కత్తుల ప్రదీప్ రెడ్డి,మహేశ్వరం శేఖర్ రెడ్డి,తాటిపెల్లి కుమార్, కంచర్ల హరీష్,పులి యాకస్వామి,చింత శ్రీరాం,బస్వ మల్లేష్,శ్రీకాంత్,ఐలు కుమార్, తదితరులున్నారు.

# ధర్మాపురం గ్రామ పంచాయతీకి ప్రశంసా పత్రాన్ని అందజేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా, యువ వెలుగు అక్టోబర్ 08 :** టిబి ముక్త్ భారత్(ందీ వీబనే దీఫ్థుతీఫ్) లక్ష్య సాధనలో భాగంగా విశేష కృషి చేసినందుకు గాను ఈరోజు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ఉజిల్లా మేజిస్ట్రేట్ సందీప్ కుమార్ ఝా చేతుల మీదుగా దేవరుప్పుల మండలం,ధర్మపురం గ్రామ పంచాయతీకి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ గౌరవ ప్రదమైన ప్రశంసా పత్రాన్న ధర్మపురం గ్రామ సర్పంచ్ దౌపాటి అశ్విని అందుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (వీుణఉ) మేనక పౌడెల్,పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.గ్రామాన్ని టిబి రహితంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములైన గ్రామ పాలకవర్గానికి,అధికారులకు,వైద్య సిబ్బందికి,ఆశా వర్కర్లకు,నిరంతరం సహకరించిన ధర్మపురం గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక అభినందనలు ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్ దౌపాటి అశ్విని.

# భూ వివాదంలో కొత్త ట్విస్ట్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఇబ్బందులకు గురి చేసి, అన్యాయంగా, అక్రమంగా దొంగతనంగా పాసుబుక్ తీసుకోవడం జరిగింది.. అని రైతు పాలకూర్ల వేంకటయ్య S/o.మాదారు నాగిళ్ళ గ్రామ రైతు ఆరోపించడం జరిగింది..రెవిన్యూ అధికారులు దృష్టికి తీసుకొని పోగా అధికారులు స్పంచింది రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిపివేశారు.రికార్డుల్లో తన పేరుతో ఉన్న భూమిని ఇతరులు అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఓ రైతు అధికారులను ఆశ్రయించిన ఘటన రంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి వచ్చింది. తనకు సంబంధించిన భూమి విషయంలో కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారని రైతు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఫిర్యాదు వివరాల ప్రకారం.. తాను పాత రికార్డులు, భూ పత్రాల ఆధారంగా భూమిపై హక్కు కలిగి ఉన్నానని రైతు చెబుతున్నాడు. సంబంధిత గ్రామంలో తనకు సంబంధించిన భూమి విస్తీర్ణం, సర్వే నంబర్లు తదితర వివరాలు రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉన్నాయని పేర్కొన్నాడు. మొత్తం భూమిలో కొంత భాగం వ్యవసాయ భూమిగా కొనసాగుతుండగా, మరికొంత భూమికి సంబంధించి పాత రికార్డులు ఉన్నాయని తెలిపాడు.

అయితే తనకు తెలియకుండా కొందరు వ్యక్తులు భూమిపై హక్కులు ఉన్నట్లు చూపిస్తూ పత్రాలు దొంగతనంగా తయారు చేశారని రైతు పాలకూర్ల వెంకటయ్య ఆరోపిస్తున్నాడు. ముఖ్యంగా జంగా రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూమి వ్యవహారంలో వివాదం తలెత్తినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. భూమి యాజమాన్యానికి సంబంధించిన పత్రాలు, పాత రికార్డులు పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి బయటపడుతుందని రైతు అధికారులను కోరుతున్నాడు.

**2022లో రిజిస్ట్రేషన్ జరిగిందంటూ ఆరోపణ**

2022 సంవత్సరంలో తనకు సంబంధం లేకుండా భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను తయారు చేసి, రిజిస్ట్రేషన్ చేయించినట్లు రైతు ఆరోపించాడు. తన అనుమతి లేకుండా భూమి విషయంలో ఎలాంటి లావాదేవీలు జరగకూడదని, అయినప్పటికీ కొందరు వ్యక్తులు పత్రాలను ఉపయోగించి భూమిపై హక్కులు పొందేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాడు. ఈ వ్యవహారంలో సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని రైతు పాలకూర్ల వెంకటయ్య కోరుతున్నాడు. రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన పత్రాలు, సంతకాలు, ఆధార్ వివరాలు, సాక్షుల వివరాలు, డాక్యుమెంట్ తయారీకి సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తే అసలు విషయం తేలుతుందని చెబుతున్నాడు.

**అధికారుల జోక్యం కోరుతున్న బాధితుడు**

తన భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, అక్రమంగా జరిగినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతు విజ్ఞప్తి చేశాడు. భూమి హక్కులపై పూర్తి స్థాయి విచారణ జరిపి, నిజమైన యజమానికి న్యాయం చేయాలని కోరుతున్నాడు. అలాగే రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా రికార్డులను పరిశీలించి భూమి అసలు యజమాని ఎవరు? ఏ పత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్ జరిగింది? 2022లో జరిగిన లావాదేవీలకు చట్టబద్ధత ఉందా? అనే అంశాలపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని పాలకూర్ల వెంకటయ్య అంటున్నారు. భూమి పత్రాల విషయంలో ఆరోపణలు తీవ్రంగా ఉండటంతో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది అని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

# నల్గొండలో వికసిత్ భారత్ సంకల్ప్ జ్యోతి యాత్ర




**నల్గొండ, యువ వెలుగు, అక్టోబర్ 08 :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, బీజేపీ నల్గొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నల్గొండ పట్టణ గడియారం సెంటర్ లో వికసిత్ భారత్ సంకల్ప సభ మరియు సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమం బిబీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి అధ్యక్షతనజరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమ వివరాలు: ఉదయం 8 గంటలకు జిల్లా కార్యాలయంలో అల్పాహారంతో ప్రారంభమైన కార్యక్రమం, 9 గంటలకు గడియారం సెంటర్‌లో సాంస్కృతిక కార్యకమాలతో కొనసాగింది. ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ప్రధాని మోదీ చేసిన వర్చువల్ ప్రసంగాన్ని నల్గొండలోని బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద తెరపై తిలకించారు. అనంతరం గడియారం సెంటర్ నుండి ఎన్.జి. కాలేజ్ వరకు బిసేవా జ్యోతి కాగడాల ర్యాలీబి భారీగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, నేటికి 25 సంవత్సరాలుగా అవిశ్రాంతంగా ప్రజా సేవలో ఉన్నారు. గుజరాత్ ను అభివృద్ధి మోడల్‌గా నిలిపి, ప్రధానమంత్రిగా భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపారు" అని కొనియాడారు.

**మోదీ గారి 25 ఏళ్ల పాలనలో ప్రధాన సంక్షేమ పథకాలు:**

జన్ ధన్ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛ భారత్, ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్ నిధి, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి చారిత్రాత్మక పథకాలు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, మహిళలు, యువత, నరేంద్ర మోదీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సేవకు ప్రతి రూపం "అమ్మ నాన్న ఫౌండేషన్"



**సూర్యాపేట, యువ వెలుగు, అక్టోబర్ 08 :** అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికురాలి కుమారుడు, గాయపడిన విద్యార్థికి ఆర్థిక సహాయం రూ 10,000 రూపాయలను అందజేసిన అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ పెరుమాళ్ళ శ్రీనివాస్ మరియు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్. సమాజంలో నిరుపేద బడుగు బలహీన వర్గాలకు తమ వంతు సహాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో అమ్మ నాన్న ఫౌండేషన్ ముందుంటుందని మాజీ మున్సిపల్ పర్సన్ పెరుమళ్ల అన్నపూర్ణ, ఫౌండేషన్ చైర్మన్ పేరుమళ్ళ శ్రీనివాస్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పారిశుధ్య కార్మికురాలు జెట్టి పద్మ కుమారుడు జెట్టి నరేష్ ఇటీవల జారి పడటంతో మోకాళ్ళలో నరాలు చిట్లి నడవలేని స్థితిలో ఉన్నాడు. ఆపరేషన్ చేసేందుకు రూ లక్షన్నర వరకు కావాల్సి ఉండగా అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ 10వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందజేసి మాట్లాడారు. చదువుకునే విద్యార్థి ప్రమాదానికి గురై మోకాల్లో నరాలు చిట్లి మంచానికి పరిమితం కావడం బాధాకరమన్నారు. నరేష్ మోకాలికి శస్త్ర చికిత్స జరిగి పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పారిశుద్ధ్య కార్మికురాలు ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున నిరుపేద కుటుంబానికి చెందినందున ఎవరైనా ముందుకు వచ్చి ఆపరేషన్ కు కావలసిన సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. సేవకు ప్రతిరూపం అమ్మ నాన్న ఫౌండేషన్ అని తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిరుపేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

# విద్యుత్ సమస్యలపై ఫోరంలో ఫిర్యాదు చేయొచ్చు

## - సీజీఆర్ఎఫ్ చైర్మన్ కే.సాయిబాబా



**యాదాద్రి భువనగిరి జిలా, యువ వెలుగు, అక్టోబర్ 08 :** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) నిరంతరం అందుబాటులో ఉంటుందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ కే.సాయిబాబా తెలిపారు.విద్యుత్ సరఫరా, మీటర్లు, బిల్లులు, కొత్త కనెక్షన్లు తదితర సమస్యలపై వినియోగదారులు వేదికను ఆశ్రయించి పరిష్కారం పొందవచ్చన్నారు. బుధవారం భువనగిరి కిసాన్‌నగర్ లోని విద్యుత్ కార్యాలయంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, లోఓల్టేజీ, మీటర్ల పనితీరు, అధిక బిల్లులు, కొత్త సర్వీసుల మంజూరు,మీటర్ పేరుమార్పిడి, కేటగిరీ మార్పు, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన సమస్యలను ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులు వ్రాతపూర్వకంగా లేదా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

**సమస్యలను సత్వరం పరిష్కరించాలి**

జిల్లాలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని వినియోగదారుల సంఘాల ప్రతినిధి కొడారి వెంకటేష్ కోరారు. రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని కోరారు. గృహజ్యోతి పథకం ప్రయోజనం అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటకుండా హరితహారం కార్యక్రమంలో అధికారులు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమస్యలపై ఫోరం సభ్యులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు వి.రమణమూర్తి, కే.శోభారాణి, టి.కోటేశ్వరరావు, భువనగిరి, రామన్నపేట, బీబీనగర్, మోత్కూరు, ఆలేరు, చౌటుప్పల్ డివిజన్‌ల విద్యుత్ ఇంజినీర్లు, ఏఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# దేవాలయాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు : మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 08 :** హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి 3.80 కోట్లు, పొట్లపల్లి శ్రీ స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి 1.50 కోట్లు హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి 85 లక్షల నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాలు అభివృద్ధి పథంలో ఉండాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసేందుకు సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి అవసరమైన నిధుల వినియోగానికి దేవాదాయ శాఖ పరిపాలన అనుమతులు జారీ చేసినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం లోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం పట్ల భక్తులు ఆలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు

# విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ




**చిట్యాల, యువ వెలుగు, అక్టోబర్ 08 :** కాంగ్రెస్ ప్రభుత్వం మాహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మహిళా సంఘాల ద్వారా కుట్టించిన స్కూల్ యూనిఫామ్ లను వెలిమినేడు గ్రామంలోని పాఠశాలలో సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గౌడ్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అరుణ, ప్రైమరీ స్కూల్ హెచ్.ఎం శ్రీనివాస్, విబికే లు ఆరూరి కలమ్మ, మహంకాళి వనజ, చింత కిందిసుమతి, ఉంగరాల సుభాష్, సంఘ బంధం అధ్యక్షురాలు కొంపెల్లి మానస, ఉపాధ్యక్షులు ఏనుగు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ ఉద్యోగి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గాజెంగి నందయ్య



**జగిత్యాల/ మెట్ పల్లి, యువ వెలుగు, అక్టోబర్ 08 :** రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి బోయినిపల్లి అశోక్ కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజెంగి నందయ్య పరామర్శించారు. మెట్ పల్లి మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి అశోక్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. చిన్న వయసులోనే అశోక్ మృతి చెందడం బాధాకరమన్నారు. అశోక్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# 8 నుంచి హైదరాబాద్‌లో ఆర్చరీ ప్రీమియర్ లీగ్




**హైదరాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 08 :** ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) సీజన్-2 అక్టోబర్ 8 నుంచి 18 వరకు నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరగనుందని ఏపీఎల్ డైరెక్టర్ అనిల్ కామినేని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ జోరిస్ పాలోస్ ఉమ్మాచెరిల్ తోకలసి ఆయన మాట్లాడుతూ ఏపీఎల్‌కు అంతర్జాతీయ ఆదరణ పెరుగుతోందని తెలిపారు. రాజ్‌పుతానా రాయల్స్, పృథ్వీరాజ్ యోధాస్, కాకతీయ నైట్స్, మైటీ మరాఠాస్, చేతో ఆర్చర్స్, చోళ చీఫ్స్ జట్లు తలపడనున్నాయని తెలిపారు. 48 మంది ఆర్చర్లు పాల్గొనే లీగ్ ఫైనల్ అక్టోబర్ 18న జరగనుందని తెలిపారు. ఏషియన్ గేమ్స్ స్వర్ణ విజేత చికితా తానిపర్తి, ఒలింపిక్ పతక విజేత కేసీ కాఫ్‌హోల్డ్ తోపాటు దీపికా కుమారి, ఓజస్ ప్రవీణ్ దేవ్‌తాలే, జ్యోతి సురేఖ వెన్నం, ధీరజ్ బొమ్మదేవర, అంకిత భకత్, అతాను దాస్, కుంకుమ మహోద్, అలెజాండ్రా వాలెన్సియా, నికో వీనర్, ఆండ్రియా బెసెరా బరిలోకి దిగనున్నారని తెలిపారు.

# బాధితురాలికి చట్టపరంగా న్యాయం చేయాలి

## కలెక్టర్‌కు మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు వినతి



**చందూరు, యువ వెలుగు, అక్టోబర్ 08 :** పీకే మల్లేపల్లిలో గాంధీ జయంతి రోజున మాదిగ మహిళపై జరిగిన దాడి ఘటనపై బాధితురాలికి న్యాయం చేయాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు కోరారు. బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో బాధితురాలిని వెంట తీసుకెళ్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వివరించారు. బాధితురాలు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఆమెకు చట్టపరమైన న్యాయం కల్పించాలని, రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను అందించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ ఘటనపై అధికారులు సమగ్రంగా పరిశీలించి బాధితురాలికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కత్తుల జగన్ కుమార్, ఉపాధ్యక్షులు పెరిక అంజయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కురుపాటి గణేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి శివరామకృష్ణ, కత్తుల సన్నీ, మాస్ అధ్యక్షులు కపోల్ అశోక్, ఒంటపాక యాదయ్య, బొజ్జ పాండు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ ప్రస్థానం.. దేశానికి స్ఫూర్తి

## -25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో కీలక నిర్ణయాలు: కాసం వెంకటేశ్వర్లు



**యాదాద్రి భువనగిరి, యువ వెలుగు, అక్టోబర్ 08 :** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు అన్నారు.బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరు అశోక్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం భువనగిరి పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా వికసిత్ భారత్ సంకల్ప సభ, సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్ జ్యోతి వెలిగించి,ప్రధాని మోదీ ప్రసంగాన్ని కార్యకర్తలతో కలిసి ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు.అనంతరం సేవా జ్యోతి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ,ప్రధానిగా మూడోసారి కొనసాగుతున్నారని తెలిపారు. జన్‌ధన్, ఉజ్వల, స్వచ్ఛభారత్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలతో దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించేందుకు కార్యకర్తలు ప్రజల్లో ఉండి ప్రభుత్వ పథకాలను వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, తుమ్మల మురళీధర్‌రెడ్డి, మాయ దశరథ, జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్, గూడూరు నరోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొప్పుల యాదిరెడ్డి, చందా



మహేందర్‌గుప్తా, కాదూరి అచ్చయ్య, జిల్లా మీడియా కన్వీనర్ ఆకుతోట రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దయ్యాల కుమార్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురి చంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూల పండుగకు పల్లె జోష్

**బతుకమ్మలతో మహిళల ర్యాలీ..**
**ఆటపాటలతో సందడి**
**సంప్రదాయ సంస్కృతిని కాపాడుకోవాలన్న వక్తలు**



**యాదాద్రి భువనగిరి, యువ వెలుగు, అక్టోబర్ 08 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భావితరాలకు అందించేలా కాపాడుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు.బుధవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళా సమాఖ్య,ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు బతుకమ్మలతో మహిళలు ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి,ప్రకృతితో మమేకమైన సంస్కృతికి ప్రతీక అన్నారు.సంప్రదాయ కళారూపాలు, ఆటపాటలను కాపాడేందుకు ప్రభుత్వాలు ప్రోత్సాహం, నిధులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత,ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, ఏఐటీయూసీ నాయకులు బోలగాని సత్యనారాయణ, ఎండీ ఇమ్రాన్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బుషపాక నరసింహ, పలువురు మహిళలు,నాయకులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్




**దోమకొండ, యువ వెలుగు, అక్టోబర్ 08 :** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని తెలంగాణ రాష్ట్ర సలహాదారు మొహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి నియోజక వర్గంలోని జంగంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (PACS) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాం క్షలు తెలిపారు.నూతన రాజు చైర్మన్‌గా సావుసాని యాదవరెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, పాలకవర్గ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులను షబ్బీర్ అలీ గారు అభినందించారు. రైతులకు అండగా PACSలు పని చేయాలి.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగు పడితేనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా రాజులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సహకార సంఘాలు కేవలం రుణాల పంపిణీకి మాత్రమే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ గారు తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.జంగంపల్లి PACS నూతన చైర్మన్ సావుసాని యాదవరెడ్డిని అభినందించిన ఆయన.. రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా ప్రతి రైతుకు సమానంగా సేవలందిస్తూ PACSను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఇల్యాస్ గారు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, భిక్నూర్ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, రాజంపేట మండల అధ్యక్షులు కృష్ణ రావు, సొసైటీ చైర్మన్లు ఇంద్రకరణ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, సుధాకర్, అనంత్ రెడ్డి, రాజ సెల్ అధ్యక్షులు బాలరాజు, ప్రకాష్, వీరన్న, లింగ రెడ్డి, కామారెడ్డి పట్టణ అధ్యక్షులు సందీప్, దోమకొండ మండల అధ్యక్షులు ఆశబోయిన శ్రీనివాస్, కామారెడ్డి మండల అధ్యక్షులు రాజగౌడ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిద్దారములు, మాజీ సర్పంచ్లు ర్సింలు,ఫైసల్, పటేల్ సాయిబాబా, బాలకిషన్, సుధాకర్ రెడ్డి, షాద్దుల్లాహ్, నరేష్, బాబు, ప్రభాకర్ గౌడ్, ఆనంద్ రావు, స్వామి, గంగారాం, శివ కుమార్, శ్రీనివాస్ గౌడ్, గోపి గౌడ్, శ్రవణ్ రెడ్డి, దిలీప్ కుమార్, నాగరాజు, బాల్వంత్ రావు, రమేష్ నాయక్, శ్రీను నాయక్, ప్రవీణ్ నాయక్, వార్డ్ సభ్యులు బాబు, బన్నీ, సుజాత, రవి, అమీన్, కార్తీక్, NSUI నాయకులు భారత్, టీంకు, దేవిడ్, అనిరుద్, ప్రదీప్ మహిళలు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

# అతివేగానికి కళ్లెం వేయాలి

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్




**యాదాద్రి భువనగిరి జిల్లా, యువ వెలుగు, అక్టోబర్ 8 :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు.బుధవారం వీసీ హాల్‌లో ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్‌తో కలిసి రహదారి భద్రతపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వివరాలు,గత సమావేశంలో సూచించిన మేరకు అక్కడ చేపట్టిన ప్రమాద నివారణ చర్యలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.బ్లాక్‌స్పాట్ల వద్ద రంబుల్ స్ట్రిప్స్, రోడ్ స్టడ్స్,వేగ పరిమితి సూచికలు, హెచ్చరిక బోర్డులు, బ్లింకర్లు ఏర్పాటు చేయడంతో పాటు రహదారి పరిస్థితులకు అనుగుణంగా ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మానవ తప్పిదాలు, అతివేగం, వాహనాల నిర్లక్ష్యపు డ్రైవింగ్ తదితర కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రోడ్డు భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అవసరమైన చర్యలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రమాదాల తీవ్రతను తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు.రహదారి భద్రతకు సంబంధించి పోలీసు, రవాణా, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్‌రెడ్డి, రవాణా అధికారి నరేష్, జాతీయ రహదారుల అధికారులు, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు సమష్టి పోరు

### వినియోగం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు

### కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి, యువ వెలుగు, అక్టోబర్ 8 :** జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం,అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా ముందస్తు చర్యలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బుధవారం వీసీ హాల్‌లో ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్‌తో కలిసి యాంటీ నార్కోటిక్స్ బ్యూరోపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇటీవల నమోదైన డ్రగ్స్ కేసులు, వాటిలో పట్టుబడిన మాదక ద్రవ్యాలు, తీసుకున్న చర్యలపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ముఖ్యంగా పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే సిబ్బంది కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, అనుమానాస్పద కదలికలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**యువతపై ప్రత్యేక దృష్టి**

కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో




డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పనిచేసే వారి కార్యకలాపాలపై నిఘా పెంచాలని, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసు, ఎక్సైజ్, సంక్షేమ, విద్యాశాఖలతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అధికారి తుక్యా నాయక్, జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బడికి ప్రధానోపాధ్యాయుడే దిక్సూచి

### -విద్యార్థుల ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్



**యాదాద్రి భువనగిరి, యువ వెలుగు, అక్టోబర్ 8 :** విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు,మండల విద్యా ధికారులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.బుధవారం కలెక్టరేట్‌లో ప్రధానోపాధ్యాయులు,మండల విద్యాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్‌లో మెరుగైన ఫలితాల కోసం ప్రతి పాఠశాలలో వారానికి గంటపాటు 'రీడింగ్ అవర్' నిర్వహించాలని ఆదేశించారు. మండలాలు, పాఠశాలల వారీగా విద్యా ప్రగతిని సమీక్షించి వెనుకబడిన పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యమివ్వాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి, డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# నీటిని పొదుపుగా వాడుదాం కరువును జెహిద్దాం

### సమన్వయంతో పని చేద్దాం సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

### సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన సర్పంచులు

### స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు



**కౌడిపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 8 :** అధికారులు సర్పంచులు సమన్వయంతో పనిచేసే సమస్యలు లేని గ్రామాలుగా మండల ప్రత్యేక అధికారి సురేష్ బాబు అన్నారు బుధవారం కౌడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలు ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలలో నిర్వహించిన పనులు సభకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణా గౌడ్ కౌడిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు తీరు పై మండి పడ్డారు. పాఠశాల బోధన క్రమశిక్షణ లేక దివాలా తీసింది అని అన్నారు ఎంఈఓ స్పందించి వెంటనే విచారణ జరిపి



పాఠశాలకు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు కరెంటు, సాగునీరు, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు, వాటి మంజూరు, విద్య, వైద్యం, ధాన్యం కొనుగోలు, విబిజీ రాంజీ పనులు ప్రధాన అంశాలతో పాటు గ్రామ పంచాయతీ సమస్యలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆయా శాఖల అధికారులు తెలిపారు ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు మాట్లాడుతూ.. ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ ఎంఈఓ బాలరాజు డిప్యూటీ తాసిల్దార్ జహీర్ ఆయా గ్రామాల సర్పంచులు చంద్రం కృష్ణ గౌడ్ పట్లోరీ శ్రీనివాస్, బోయిని వీరయ్య, తిరుపతిరెడ్డి , రవి యాదవ్ ప్రవీణ్ రెడ్డి కుమార్ ,యశోద బాలకృష్ణ, కుమ్మరి శివలీల సతీశ్ , సంధ్య పృధ్వి నాయక్, శేకులు యాదవ్, సత్యం గౌడ్, రాజు నాయక్, రమేష్ నాయక్, కుద్బుద్దీన్, రాములువివిధ శాఖల అధికారులు ఏ ఈ సాయి కుమార్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, ఏ ఈ మారుతి, ఐకెపి సీసీ ఉమాశంకర్ శర్మ,దితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా సేవా జ్యోతి యాత్ర..!



**హుస్నాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 8 :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు కృతజ్ఞతగా, వికసిత్ భారత్-2047 సాధనకు సంకల్పంగా నిర్వహిస్తున్న పీఎం సేవా సంకల్ప అభియాన్లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి సేవా జ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించారు.హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సేవా జ్యోతి ప్రోగ్రాం బాధ్యులు బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సహచర బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సేవా జ్యోతి బైక్ ర్యాలీని ప్రారంభించారు.అనంతరం సేవా జ్యోతి బైక్ ర్యాలీకి కోహెడ క్రాసింగ్ వద్ద బీజేపీ మండలశాఖ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. బస్వాపూర్ గ్రామంలో స్థానిక బీజేపీ నాయకులు ర్యాలీకి స్వాగతం పలికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి సేవా జ్యోతి ర్యాలీ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండ భూదేవి గార్డెన్ వరకు కొనసాగింది.ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గూగులోతుతిరుపతి నాయక్, హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్, అక్కన పేట మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని పలు గ్రామపంచాయతీలను తనిఖీ చేసిన ఎంపీడీవో

**తిరుమలగిరి(సాగర్), యువ వెలుగు, అక్టోబర్ 8 :** మండల పరిధిలోని కొంపల్లి, బోయగూడెం, జువ్విచెట్టుతండా గ్రామ పంచాయతీలను తిరుమలగిరి సాగర్ మండల ఎంపిడిఓ బుధవారం సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాలలో సిబ్బంది హాజరు, పంచాయతీ రికార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, అంగన్వాడీ కేంద్రాలు, పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులు మరియు ప్రభుత్వ పథకాల అమలను తనిఖీ చేశారు. గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, అభివృద్ధి పనులను నాణ్యతతో మరియు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించాలి

### లోడ్ చేసిన ట్రాక్టర్లు రాత్రిపూట ఇళ్ల వద్ద ఉంచితే కేసులు: ఎస్ఐ సుధాకర్



**భూపాలపల్లి, యువ వెలుగు, అక్టోబర్ 8 :** రేగొండ మండలంలోని అన్ని గ్రామాల ట్రాక్టర్ యజమానులతో ఎస్ఐ సుధాకర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇసుక రవాణా విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రతి ట్రాక్టర్‌కు ఇన్సూరెన్స్, నంబర్ ప్లేట్, ఆర్‌సీతో పాటు డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. ఇసుక రవాణా సమయంలో లోడ్‌పై తప్పనిసరిగా పరదా కప్పాలని సూచించారు.ఇసుక లోడ్ చేసిన ట్రాక్టర్లను రాత్రిపూట ఇళ్ల ముందు నిలిపి ఉంచరాదని ఎస్ఐ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లు ఇళ్ల వద్ద కనిపిస్తే పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.అలాగే సరైన అనుమతి పత్రాలు లేకుండా ఇసుక కుప్పలను ఇళ్ల వద్దగానీ, వ్యవసాయ భూముల్లోగానీ నిల్వ చేయరాదని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సీజ్ చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధాకర్ స్పష్టం చేశారు.

# యుటిఎఫ్ మండల అధ్యక్షుడిగా మందడి సూర్యప్రకాష్



**సూర్యాపేట/తుంగతుర్తి, యువ వెలుగు, అక్టోబర్ 8 :** రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్( టీఎస్ యూటీఎఫ్) సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి మండల నూతన అధ్యక్ష కార్యదర్శులుగా మందడి సూర్య ప్రకాష్,పాలవెల్లి ప్రేమయ్యలు ఎన్నికయ్యారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మల్లెపాక రవీందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన యుటిఎఫ్ మండల మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వాహకులుగా జిల్లా అధ్యక్షులు సోంబాబు, జిల్లా కన్వీనర్ వెలుగు రమేష్ వ్యవహరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం,వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడే అగ్రగామి సంఘం యూటీఎఫ్‌నే అన్నారు. కేవలం ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా, విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందాలని, ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలని నిరంతరం యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మిట్టగడుపుల రమేష్,భీవనపల్లి శ్రీనివాస్, పాలకుర్తి ఎల్లయ్య, గణేష్‌తో పాటు పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై రైతుల కన్నెర్ర

### చేగుంట-గజ్వేల్ రహదారిపై బైఠాయించి ధర్నా రాస్తారోకో

### పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన

### విద్యుత్ అధికారుల హామీతో ఆందోళన విరమించిన రైతులు



**రాయపోల్, యువ వెలుగు, అక్టోబర్ 8 :** వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం చేగుంట-గజ్వేల్ ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గుర్రాల సోఫా, వీరనగర్ చౌరస్తాల వద్ద రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ నినాదాలు చేశారు. అలాగే విద్యుత్ శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు నీరు అందించేందుకు విద్యుత్ కోసం ఎదురు చూడాల్సి వస్తోందని, గంటల తరబడి కోతలు విధిస్తుండటంతో సాగు తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. చేతికొచ్చిన పంటలు విద్యుత్ సరఫరా లేక నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించే వరకు కదిలేది లేదని స్పష్టం వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన పరిష్కారం లభించలేదని ఆరోపించారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. రైతుల రాస్తారోకోతో చేగుంట-గజ్వేల్ ప్రధాన రహదారిపై ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు కొంతసేపు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే విద్యుత్ సమస్య పరిష్కారంపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.

**ఏడీఈ హామీతో ఆందోళన విరమణ**

విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏడీఈ మధుసూదన్ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను పరిశీలించి వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

అధికారి హామీతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం రాస్తారోకోను విరమించడంతో రహదారిపై నిలిచిపోయిన వాహనాల రాకపోకలు క్రమంగా పునరుద్ధరించబడ్డాయి. ఇకనైనా విద్యుత్ కోతలు లేకుండా వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో వీర నగర్. రామారం. వడ్డేపల్లి. సయ్యద్ నగర్. దొడ్లపల్లి. వీరారెడ్డిపల్లి ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు

# పంటలను కాపాడేందుకు 24 గంటల విద్యుత్ ఇవ్వాలి

### - దౌల్తాబాద్‌లో శివాజీ చౌరస్తాలో అన్నదాతల ధర్నా

### - సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు



**దౌల్తాబాద్, యువ వెలుగు, అక్టోబర్ 8 :** వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ దౌల్తాబాద్ మండల కేంద్రంలో రైతులు రోడ్డెక్కారు. బుధవారం శివాజీ చౌరస్తాలో రైతులు ధర్నా నిర్వహించి విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా కాకపోవడంతో పంటలకు సకాలంలో నీరందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న పంటలకు నీరు అందడం లేదని తెలిపారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని, విద్యుత్ కోసం రాత్రివేళల్లో సైతం పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికే పంటల సాగు కోసం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టామని, విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. వ్యవసాయానికి 24 గంటలపాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. రైతులు శివాజీ చౌరస్తాలో రోడ్డుపై ధర్నా చేపట్టడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల ఆందోళనతో కొద్దిసేపు దౌల్తాబాద్ ప్రధాన రహదారిపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్య సుభాష్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత



**దోమకొండ, యువ వెలుగు, అక్టోబర్ 8 :** కామారెడ్డి జిల్లా దోమ కొండ మండల కేంద్రం లోని శ్రీ చాముండేశ్వరి దేవి ఆలయంలో ఈనెల 11వ తేదీ నుంచి జరిగే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డికి ఆలయ చైర్మన్ ధర్మకర్తలు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరై తన వంతు సహకారం అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**Editor P. Mahesh Goud,** Rachakonda printer's & publication's, Sri balaji printing press, H.No:-5-2-396, Venkateshwara colony, saheb nagar, Rangareddy, 500070
PRGI: TGTEL /26/A6429 office address : #5-4-183, Twin city towers complex, Abids, Hyd-500001, TG. yuvavelugu@gmail.com. Contact number : **9908 502 602**